# మధుశాలిని వెడ్స్ పుల్లయ్య!

కథ

డిగ్రీ పరీక్షలు అయిపోయిన ఆనందంలో మధుశాలిని ఇంట్లో టీ పార్టీ చేసుకుంటున్నారు స్నేహితురాళ్ళంతా. బయట సన్నని వాన..వంటింట్లోంచి మధువాళ్ళమ్మ అన్నపూర్ణమ్మగారు వేడివేడిగా మిర్చి బజ్జీలు హాల్లోకి పంపిస్తుంటే...మ్యూజిక్ సిస్టమ్‌లో పాటలు వింటూ, కేరింతలాడుతూ, స్టెప్పులు వేస్తూ, తింటూ..రకరకాలుగా ఎంజాయ్ చేస్తున్నారంతా.

"పరీక్షలయిపోయాయా ఏంట్రా! ఇల్లు పీకి పందిరేస్తున్నారు?" నవ్వుతూ అప్పుడే ఇంట్లో అడుగుపెట్టేరు ప్రతాపరావుగారు. కాసేపు గౌరవ సూచకంగా అంతా సైలెంటయ్యారు. ఆ సైలెన్స్‌ని భరించలేన్నట్టు ఆయన జేబులో సెల్ మోగింది. ఆయన ఎటెన్షన్‌లో కొచ్చారు. ఎందుకంటే అది మంత్రి రాయుడుగారి కాల్.

"నమస్తే సార్...అంటే..అదీ..మీ వంటివారితో వియ్యమందడంకంటే నాలాంటివాడికి వేరే అదృష్టం మరేం ఉంటుంది సార్! అయినా ఈకాలం ఆడపిల్లలు తల్లిదండ్రులకి అంత అదృష్టం పట్టనిస్తారా చెప్పండి. అల్లారుముద్దుగా పెంచినందుకు నాకు బాగా బుద్ధిచెప్పింది సార్ నా కూతురు" అంటూ ఉండగా ఆయన కంఠం సన్నగా వణికింది.

యధాలాపంగా ఏదో తింటూ తండ్రి మాటలు వింటున్న మధు గొంతు ఒక్కసారిగా కొరబోయింది. స్నేహితురాళ్ళంతా ఆశ్చర్యంగా నోళ్ళు తెరచి వింటున్నారు.

"నిన్న మీ అబ్బాయి వినోద్ సంగతి ప్రస్తావించాక గానీ మా అమ్మాయి తన లవ్ ఎఫైర్ సంగతి బైటపెట్టలేదు సుమండీ! కావడానికి నా స్నేహితుడి కొడుకే. చిన్నప్పట్నించీ ఇద్దరికీ స్నేహం ఉంది. వాళ్ళ నాన్నకీ నాకూ ఉన్న స్నేహంకొద్దీ ఏం అనుమానించ లేకపోయాను. పరిస్థితి ఇంత దూరం వచ్చిందనుకోలేదు" గద్గదంగా వణికింది ప్రతాపరావు కంఠం. డాడీ వంక తెల్లబోయి చూస్తోంది మధుశాలిని.

స్నేహితురాళ్ళంతా దోషిలా తననే చూస్తుంటే మధుకి ఒళ్ళంతా తేళ్ళు పాకినట్టుంది.

"వాడే ప్రాణమట. వాడ్ని చేస్కోకుండా బ్రతకలేదట. బలవంతంగా వేరే పెళ్ళి చేస్తే లెటర్ రాసిపెట్టి చచ్చిపోతుందట. అందులో నా పేరు, మీ పేరు కూడా రాస్తుందట. నా సంగతి సరే ననుకోండి. మీ పేరు రాస్తే ఇంకేమన్నా ఉందా? మీ ఇమేజీ, మీ మంత్రి పదవీ, రాబోయే ఎన్నికల్లో మీ టిక్కెట్టు, మహిళా సంఘాల గోల..." అవతల మంత్రిగారేం అన్నారో గానీ మునిమునిగా నవ్వుతూ ఫోన్ కట్ చేశారు ప్రతాపరావుగారు.

పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో అప్పటిదాకా ఊరుకున్న మిత్రబృందం ప్రతాపరావుగారి నవ్వు చూశాక ధైర్యం పుంజుకున్నారు.


"ఏం మధూ! ఇంత పెద్దసీక్రెట్ ఇన్నాళ్ళూ దాచావా మా నుంచి" అని మాధురి,

"చెప్తే మేమేం లేపుకుని పోతాంటే నీ ప్రియుణ్ణి" అంటూ లలిత.

"ఎలా ఉంటాడే! షారూఖ్‌లానా? పవన్‌లానా? పేరేంటే?" అని రమ్య, అలాంటూ ఒక్కొక్కరూ సతాయించేస్తుంటే ఏం చెప్పాలో తెలీక డాడీకేసి మింగేసేలా చూసింది మధు.

ఫ్రెండ్స్ అందర్నీ ఎలాగో వదిలించుకున్నాక నిప్పులు కురిపించే కళ్ళతో తనమీద దాడికొస్తున్న కూతుర్ని చూసి అంతటి ఇంటలిజెన్స్ ఆఫీసర్ ప్రతాపరావుగారే కంగారుపడిపోయారు.

"ఏంటి డాడీ ఇదంతా? అసలా



డా. పేరాల శ్రవణ్ కుమార్

కుర్రాడెవరో కూడా నాకు తెలీదు. నేను అతన్ని ప్రేమించానని నా ఫ్రెండ్స్ అందరి ముందూ చెప్తారా! అసలీ ప్రేమలంటేనా నాకు పడదని నీకు తెలుసుకదా! అయినా నా గురించి మీరే ఇలా..'' ఆమె కంఠం రుద్ధమైంది.

దాన్తో ప్రతాపరావుగారు చలించిపోయి కూతుర్ని ప్రేమగా దగ్గరికి తీసుకున్నారు.

"సారీరా మధూ! తప్పని పరిస్థితుల్లో అలా చెప్పాల్సి వచ్చింది'' అంటూ వివరించారు.

"మన ఇరుగుపొరుగున ఉండే మంత్రి రాయుడు గారి కొడుకు వినోద్ బెంగుళూరు నుంచి ఈమధ్యే వచ్చాడట. నిన్నెక్కడో చూశాడట. అప్పట్నించీ నిన్నే పెళ్లి చేసుకుంటానని పట్టుపడుతున్నాట్ట. తాంబూలాలు పుచ్చుకుందామని ఆ రాయుడు రోజూ నాకు ఫోన్లు..విసుగెత్తిపోతోందనుకో. పోనీ ఆలోచిద్దామా అంటే...ఓ ఇంటలిజెన్స్ ఆఫీసరుగా ఆ రాయుడి హిస్టరీ నాకు తెలుసు. వాడో రాజకీయ రౌడీ. ఆ వినోద్ కూడా తండ్రికి తగ్గ తనయుడే. వాడి అరాచకాలు భరించలేకే చదువు పేరుతో బెంగుళూరు పంపించేశాడు వాళ్ళ నాన్న. ఈమధ్యనే తిరిగొచ్చాడట. తండ్రి సంపాదన తగలెయ్యడం తప్ప వాడికి పనేం లేదు. అలాంటివాడికి బంగారంలాంటి నా పిల్లనివ్వనని చెప్పాననుకో, ఆ కక్షమీద ఈ వయసులో నన్నే కొండల్లోకో ట్రాన్స్‌ఫర్ చేయించేస్తాడు ఆ రాయుడు. అందుకేరా కర్ర విరక్కుండా, పాము చావకుండా ఇలా చెయ్యాల్సొచ్చింది'' తప్పుచేసినవాడిలా తలొంచుకున్న డాడీని చూసి బోల్డు జాలి వేసింది మధుకి.

"నాకు తెలుసు డాడీ! కారణం లేకుండా నువ్వి లాంటి అబద్ధం చెప్పవనీ. ఇంతకీ నీ ఫ్రెండు..నీ ఫ్రెండు కొడుకు నా ఫ్రెండు కల్పిత కథలో క్యారెక్టర్లేనా లేక..'' అర్ధోక్తిగా ఆగి నవ్వింది.

"ఎందుకు లేరమ్మా..లక్షణంగా వున్నారు. ఆ రాజారావ్‌గాడు నా బాల్యస్నేహితుడే. వాడిలాగే వాళ్ళబ్బాయి కూడా నిఖార్సైన మనిషి. ఈ ఊళ్ళోనే కస్టమ్స్ ఆఫీసరుగా ఈమధ్యనే ఉద్యోగంలో చేరాడట కూడాను. అన్ని విధాలా నీకు తగ్గ జోడీ. కావాలంటే ఫోటో చూడు'' అంటూ జేబులోంచి ఫోటో బయటికి తీశారు.

"వావ్! టాల్, డార్క్ అండ్ హ్యాండ్సమ్. ఇంతకీ శ్రీవారి నామధేయం?'' నాటకీయంగా అడిగింది మధు ఫోటోకేసి కన్నార్పకుండా చూస్తూ.

"పుల్లయ్య''

ఫక్కున నవ్వింది డాడీ చెప్పింది వింటూనే.

"ప్లీజ్ డాడీ! మా ఆయనమీద జోకులేస్తే నాక్కోపం వస్తుంది. అలుగుతా..చెప్పుడాడీ అసలు పేరేంటో'' చిన్నపిల్లలా మారాం చేసింది మధు.

"నిజమే చెప్తున్నానా! అతని పేరు పుల్లయ్యే. వాళ్ళ తాతగారి పేరు. ఆయన ఆరోజుల్లో గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ఆ కుర్రాడికి కూడా వాళ్ళ తాతయ్య అంటే చాలా ఇష్టమట!''

మధుశాలిని ముఖం వివర్ణం అవడం ఆయన గమనించకపోలేదు.

అంతలో అన్నపూర్ణమ్మగారు బజ్జీల ప్లేటుతో వంటింట్లోంచి వచ్చారు.

"ఏమండీ! రాజారావు అన్నయ్యగార్ని కలుస్తానన్నారు. కలిశారా? ఏమన్నారూ'' అంటూ.

"కలవడమేంటోయ్! అమ్మాయిని చూసుకోవడానికి ప్లస్ తాంబూలాలు పుచ్చుకోవడానికీ రెండ్రోజుల్లో వస్తాం అంటుంటేనూ'' అన్న భర్త మాటలు విని మురిసిపోయింది ఆవిడ.

అతనెంత బావున్నాడో పేరు అంత మోటుగా ఉంది. ఫ్రెండ్స్‌కి ఎలా చెప్పుకోవడం? మధు మనసంతా కల్లోలంగా ఉంది. ఉత్సాహమంతా నీరుకారిపోతోంది.

"నీకు గుర్తులేదటే మధూ. చిన్నప్పుడు నువ్వూ, అతనూ ఐదోక్లాసు, ఆరోక్లాసూ కలిసే చదివేరు రాజమండ్రిలో ఉండగా. మనకి ట్రాన్స్‌ఫరై వస్తుంటే అతన్ని వదల్లేక మనతో వచ్చెయ్యమని ఏడిచి గొడవ చేశావు కూడానూ'' తల్లి చేతులు ఊపుతూ చెప్తున్న మాటలేవీ ఆమె చెవిన పడడం లేదు.

'పిల్లలకి పేర్లు పెట్టే ముందు ఈ పెద్దవాళ్ళెందుకు ఆలోచించరో' అనుకుంటూ తండ్రికేసి బేలగా చూసింది. కూతురి బాధ ఆయనకర్థమైంది.

"పేరులో ఏముంది మధూ! అది పెద్దలు పెట్టేది. ఎవరికి వారు సంపాదించుకునే పేరేరా మనిషికి విలువ తెచ్చేది. చాకులాంటి కుర్రాడు. కష్టపడి పైకొచ్చినవాడు. నిజాయితీ కలిగిన కస్టమ్స్ ఆఫీసర్. బాగా ఆలోచించుకో. నీకు నచ్చలేదంటే బలవంతం ఏం లేదు. పేరు బావున్న మరో సంబంధం చూద్దాం'' అంటూ భుజం తట్టేరు ప్రతాపరావుగారు.

"పేరు చూసి బంగారంలాంటి కుర్రాణ్ణి కాదనకమ్మా. వాళ్ళ తల్లిదండ్రులు కూడా మనకి బాగా తెలిసిన వాళ్ళు. సౌమ్యులు. ఆలోచించుకోమ్మా'' హెచ్చరించింది అన్నపూర్ణమ్మగారు.

## తమన్నా రూటే వేరు

హీరోయిన్ల కాల్షీట్ల గురించి, పారితోషికం గురించి నిర్మాతలు మాట్లాడాలంటే ముందుగా పియ్యేలు, మేనేజర్లు లాంటివాళ్లతోనే కలవాల్సి వుంటుంది. కానీ మిల్కీవైట్ బ్యూటీ తమన్నా అలా కాదుట. ఆమెతో సినిమా గురించి సంప్రదించాలంటే ముందుగా ఆమె పేరెంట్స్‌తో మాట్లాడితే చాలుట. తర్వాతే వాళ్లే ఆ సంగతి తమ కూతురికి చెప్తారట. ఇక డైరెక్ట్‌గా తమన్నాయే సదరు పార్టీతో చర్చిస్తుంటుంది. ఇది నిర్మాతలకు చాలా సౌకర్యవంతంగా వుంటుందని సినీజనాల ఉవాచ.



బాగా ఆలోచించాక తల్లిదండ్రుల మాటే నిజం అనిపించింది మధుకి. పైగా ఫోటో చూశాక 'చాకులాంటి కుర్రాణ్ణి' వదులుకోవాలంటే బెంగగానే ఉంది.

"మీకన్నా నాకు శ్రేయోభిలాషులెవరుంటారు డాడీ. నేములో నేమున్నది. ప్రొసీడ్'' అంటున్న కూతురికేసి గర్వంగా చూశారు ప్రతాపరావుగారు.

☆☆☆

తాంబూలాల రోజు డార్క్ కలర్ ప్యాంట్, స్కైబ్లూ కలర్ టీ షర్ట్‌లో ఎత్తుగా ఉండి మత్తెక్కించేలా నవ్వుతూ ఎంట్రీ ఇచ్చిన తన హీరోని చూడగానే హార్ట్‌బీట్ మిస్సయ్యింది మధుకి. ఆ విశాలమైన ఛాతీ, ఆ కోర మీసం చూస్తుంటే అర్జంటుగా ముహూర్తాలు పెట్టించెయ్యాలనిపిస్తోంది.

"గుర్తొచ్చానా!'' చూపుల స్ట్రాలతో తనని పీల్చేస్తున్నట్టు చూస్తూ అడుగుతున్నాడు.

"పాత ఫ్రెండ్స్ ఇద్దరూ కాసేపు మాట్లాడుకోండి. మేమెందుకు మధ్యలో!'' అంటూ నవ్వుకుంటూ పెద్దవాళ్ళంతా ఇల్లు చూసే నెపంమీద ఏకాంతం కల్పించారు.

"రెండేళ్ళు కలిసి చదివేం. కలిసి ఆడేం. అయినా నేనసలు గుర్తులేనట్టే చూస్తున్నావే? పోనీ కొన్ని ఇన్సిడెంట్స్ చెప్పనా..అప్పుడు గుర్తొస్తానేమో" అంటున్నాడతను. చెప్పమన్నట్టు రెప్పలల్లార్చింది మధుశాలిని.

"చిన్నప్పుడు నువ్వు నాతో తప్ప ఎవరితోనూ ఏ ఆటా ఆడేదానివే కాదు తెలుసా? పొట్టి పొట్టి స్కర్టులేస్కుని నువ్వూ, పొట్టిలాగులో నేనూ కబాడీ ఆడుకునే వాళ్ళం. నేనేమో ఎలాగైనా లైన్ టచ్ చెయ్యాలని చేస్తుంటే, నువ్వేమో నన్నెలాగైనా లైన్ టచ్ చెయ్యకుండా ఆపాలని నా మీద పడిపోయి, గట్టిగా పట్టేస్కుని, ఉక్కిరిబిక్కిరి చేసేదానివి. గుర్తులేదా?" అప్పటికే సిగ్గుతో టమోటా రంగులోకొచ్చేసింది ఆమె వదనం.

"పోనీ ఇదైనా గుర్తుందా? మీ ఇంటి పెరట్లో ఓ సిమెంట్‌తో చేసిన నీళ్ళతొట్టి ఉండేది. దాంట్లో నువ్వు, నేను, జలకాలాడే వాళ్ళం. నేనేమో నీ వీపు తోముతుంటే నువ్వేమో..."

"చాలు మహానుభావా! సీన్ అర్థమైంది" నవ్వుతూనే సెన్సార్ చేసేసింది మధు.

"ఒక్క ఆట మాత్రం నాకు చెప్పాపెట్టకుండా నువ్వొక్కర్తివే ఆడేశావ్" చిరుకోపంగా అన్నాడతను.

"ఒక్కర్తినే ఆడేనా! ఏం ఆట ఆడేను?" అమాయకంగా అడిగింది మధు.

"సమర్తాడేవ్. ఆ తర్వాతే మనం విడిపోయాం" ఆసాంతం ఆమెని పరికిస్తూ అన్నాడు చిలిపిగా.

"ఛీ!" సిగ్గుతో సోఫా కిందికి దూరిపోవాలనిపిస్తోంది మధూకి, ఆ క్షణంలో..అంతలోనే గట్టిగా నవ్వేశాడతను.

"ఏం చెప్పినా నమ్మేస్తావా? ఏదో సర్దాగా కల్పించి చెప్పేను గానీ అంత చిన్న వయసులో ఏం ఆడుకున్నామో ఇప్పుడేం గుర్తుంటాయి మధూ" అతడు చిలిపిగా అంటూ ఉంటే ఆ అల్లరికి కోపం పట్టలేక "నిన్నూ..." అంటూ ప్లేట్లో లడ్డూని తీసి అతడికేసి విసిరింది మధుశాలిని.

"ఈ ఆటేదో బానే ఉందే!" అంటూ అదే లడ్డూని ఒడుపుగా పట్టుకుని అతగాడు గురిచూసి తన గుండెలమీదికి విసుర్తుంటే సిగ్గుల మొగ్గయిపోయింది మధుశాలిని.

* * *

పెళ్ళిరోజు దగ్గరపడ్తున్నకొద్దీ తొందరెక్కువైపోతోంది ఇద్దరికీ. ఫోన్లలో ఒకటే సంభాషణలు. అతడి చిలిపి అల్లరి తలుచుకున్నప్పుడల్లా మనసు మధురోహలతో నిండిపోతుంది. కానీ...అతని పేరు తలుచుకుంటేనే మనసు కలుక్కుమంటుంది.

దానికితోడు బంధుమిత్రుల ఎకసెక్కాలు.

"ఏమ్మా! మీ పిచ్చిపుల్లయ్య ఫోన్లు చేస్తున్నాడా?" బియస్సీ ఫెయిలయిన తన పుత్ర రత్నాన్ని వలచి వరించలేదనే అక్కసుతో మేనమామ విసుర్లు.

"పుల్లయ్యా! అదేం పేరమ్మాయ్ మరీ విడ్డూరంగానూ?" అడిగినప్పుడల్లా తనకి స్కూటీ ఇవ్వలేదనే అక్కసుతో పక్కింటి పారిజాతం సూటీపోటీలు.

"శుభలేఖ బాగుంది కానీ..నీ మోడ్రన్ నేమ్ పక్కన అతని పేరేనే...కాస్త ఎబ్బెట్టుగా ఉంది" క్లోజ్ ఫ్రెండ్స్ మాధురి, రమ్య కూడా అలా అనేసరికి ఏడుపొచ్చినంత పనైంది మధుకి. ఐనా ఏం చేస్తుంది?

పెళ్ళిరోజు రానే వచ్చింది. ప్రతాపరావు దంపతుల హడావిడికి అంతే లేదు.

"మధుశాలిని వెడ్స్ పుల్లయ్య" తళుకులీనే అక్షరాలు మిలమిల మెరుస్తున్నాయి కళ్యాణమండపం ఎంట్రన్స్‌లో.

పెళ్ళికొచ్చిన అతిథులు ఏం మాట్లాడుకుంటున్నా అది తన భర్త పేరు గురించే అనుకుని కుంచించుకుపోతోందామె మనసు. పెళ్ళిలో వధూవరుల పేర్లు చెప్పించే ముచ్చట అతనికి బాగానే ఉన్నా తనకి మాత్రం నరకంలా అనిపించింది.

శోభనం వేళ. ఇరువురి శరీరాలూ వీణావేణువులై మోహనరాగం ఆలపించే వేళ 'మధూ, మధూ' అని అతడు ఆర్తిగా పలవరిస్తూ తనని అల్లుకుపోతుంటే అంతే పరవశంతో అతని పేరు స్మరించబోయి అంతలోనే పాలపొంగు మీద నీళ్ళు చిలకరించినట్టు ఆమెలో ఆవేశమంతా చల్లారిపోయేది.

"ఏంటి మధూ? ఎందుకిలా? భయమా? రిలాక్స్ మధూ!" అని ఎంతగా సముదాయించినా ఫలితం లేకపోవడంతో నిర్లిప్తంగా ఉండిపోయేదు అతడు కూడా. అలా అలా రోజులు గడుస్తున్నాయే కానీ శృంగారం లేని ఆ కొత్తకాపురం ఉప్పులేని కూరలా చప్పగా సాగుతోంది.

పైకి నవ్వుతూనే ఉన్నా ఇద్దరి ముఖాల్లోనూ సుఖాల ఛాయలే కనిపించకపోవడం గమనించారు అన్నపూర్ణమ్మగారు. 'పైకి నవ్వులు రువ్వుతూ ఇలాంటి విషయాలు దాచగలమనుకుంటారీ పడుచువాళ్ళు. హు! మా అనుభవం ముందు వీళ్ళెంత?' అనుకుంటూ విషయం ఏంటో కనుక్కోమని సింహంద్రీలాంటి తన చెల్లెలి కూతురు సుపర్ణని రంగంలోకి దించారావిడ.

అక్కని మాటల్లో పెట్టి అసలు విషయం సులువుగానే రాబట్టింది సుపర్ణ-

"నీ ప్రాబ్లం చెప్పకుండా బావగార్ని అలా పస్తులు పడుకోబెడితే ఎలా చెప్పక్కా? బావ



## చార్మి వేదాంతం

ఇటీవల ఛార్మి నటించిన సినిమాలన్నీ దాదాపు ఫ్లాపయ్యాయి. 'మంత్ర' తర్వాత ఆమెకి ఒక్క హిట్టూ లేదు. దీంతో కాస్త డీలాపడిపోయిన ఛార్మి 'ఏదీ మన చేతుల్లో లేదు. మన రోజులు బావుంటే ఎలాంటి విజయమైనా ఇట్టే వరిస్తుంది. కాలం కలిసి రాకపోతే పరాజయాల్ని చవిచూడాల్సి వుంటుంది. మనమేం చేయలేం..ప్చ్' అంటూ వేదాంతాన్ని వల్లె వేస్తోంది. ఇటీవల **16** డేస్, మనోరమ సినిమాల పరాజయం అలా వుంచితే, కావ్యాస్ డైరీ సినిమా విడుదలలో జాప్యం ఛార్మిని నిరాశలో ముంచేస్తున్నట్టుంది.

మంచోడు కాబట్టి సరిపోయింది. లేకపోతే కండలు తిరిగిన బావకి నిన్ను బలవంతంగా లొంగదీసుకోవడం ఎంతసేపు చెప్పు? అయినా వాళ్ళ కండలకి మన అందచందాల్ని ఎరగావేసి వాళ్ళని లోబర్చుకుని మనమాట చెల్లించుకోవాలిగానీ ఏదేదో మనసులో పెట్టుకుని కుళ్ళుకుంటే ఎలాగక్కా!" ఆరిందాలాగా లెక్చర్ ఇవ్వడం మొదలుపెట్టింది సుపర్ణ-

"మనం ఏంటే మనం! నిన్ను కలిపేస్కుంటున్నావ్. ఏంటి సంగతి?" కోపంగా ఉరిమింది మధు.


"అమ్మయ్య! నీ మొగుడని ఆమాత్రం స్పృహ ఉంది కదా! ఉంటే బావగార్ని అలా ఎండగట్టకు. నాలాంటిదెవర్తో కనిపెట్టి మధ్యలో దూరిందంటే నీకే డేంజర్! నవదంపతులన్నాక సమస్యల్ని శృంగా...రయుతంగా పరిష్కరించుకోవాలి" అంది అదేదో సిన్మాలో రావుగోపాలావు లెవెల్లో.

"మరో విషయం చెప్పనా. సరిగ్గా టాకిల్ చెయ్యాలేగానీ నీది చాలా సింపుల్ ప్రాబ్లమ్. అదే నేనైతేనా...సర్లే- నా గొడవెందుగ్గానీ నువ్వేం చెయ్యాలో చెప్తా విను. ముందు నీ అందచందాల్లో అతన్ని ముంచి తేల్చు. అంతే. బెల్లం రుచి మరిగిన చీమలా నువ్వెక్కడున్నా నీ చుట్టూరా తిరగడం మొదలెడతాడు నీ మొగుడు.

అదే అదనుగా సరసం మాంఛి పదును మీద ఉండగా కైకేయి టైపులో కోరిక కోరెయ్, ఆ పాత మోడల్ పిచ్చిపుల్లయ్య పేరు మార్చేసుకుని నీకు నచ్చిన పేరు పెట్టుకోమని. 'ఆ' టైంలో అడిగితే పేరేం ఖర్మ ఇంటిపేరైనా మార్చేస్కుంటాడు ఏ మగాడైనా. ఇదిగో పేర్ల పుస్తకం. పక్కలోనే రెడీగా పెట్టుకో. ఆల్ ద బెస్ట్!" కొంటెగా ముక్తాయించింది సుపర్ణ.

చెల్లి సలహా సూపర్‌గా నచ్చేసింది మధుకి. 'అవును. సమస్యల్ని శృంగా...రయుతంగా పరిష్కరించుకోవాలి మరి. రానీ చెప్తా కుర్రాడి సంగతి' ముసిముసిగా నవ్వుకుంది.

ఆఫీసునుంచి వచ్చింది మొదలు ఏదో కొత్తదనం ఫీలవుతున్నాడు పుల్లయ్య. మధు మాటలు, చూపులు, బాడీ లాంగ్వేజ్, ఏదో సరస సమరానికి తొడగొడుతున్నట్టు అనిపిస్తున్నాయ్. ముత్యాల మతాబులా భళ్ళున కురిసే ఆ నవ్వులు ఏవో సందేశాలిస్తున్నాయి. నెమలి కంఠం రంగు చీర మాటున జున్ను ముక్కలాంటి నడుం మడతల్నీ, కిస్‌మిస్ పండులాంటి నాభినీ ఇలా చూపించి అలా మూసేస్తోంది. అలా మూసేసి ఇలా చూపించేస్తోంది. భోజనాలై బెడ్‌రూంలోకి వెళ్ళాక పరిస్థితి అర్థమైపోయింది అతనికి. గులాబి రేకులు జల్లిన డబల్ బెడ్ మీదకి తనువుని మదన ధనువులా వాల్చిన భార్య మీదకి ఎక్కుపెట్టిన బాణంలా ఒరిగేడు. బెడ్‌పక్కనే పేర్ల పుస్తకం చూసి ఫకాల్న నవ్వుతూ "ఇంకా శోభనమే కాలేదు. అప్పుడే పిల్లవాడికి పేరు సెలక్షనా! అంత తొందరా" అంటూనే ముద్దుల్తో ముఖ పరిచయం కానిచ్చి అంగాంగ పరిచయాలకి రంగం సిద్ధం చేస్తున్నాడు. జాకెట్ హుక్స్ తీయడానికి అతడు అవస్థపడుతుంటే తృప్తిగా నవ్వుకుందామె. మగవాడి శీలానికి అదో వర్జినిటీ టెస్ట్. అలవాటుగా విప్పేశాడో, అనుభవజ్ఞుడన్నమాటే!



ఉదయం అవుతూ ఉండగా బాల్కనీలో న్యూస్‌పేపర్ వేసిన శబ్దానికి మెలకువ వచ్చి తన పరిస్థితికి తానే సిగ్గుపడిపోయింది మధు. వేరుపడిన బట్టల్ని ఏరుకుని ధరించి న్యూస్‌పేపర్ చేతిలోకి తీసుకున్న మధు. మొదటి పేజీలో భర్త ఫోటో, దాని క్రింద రాసిన వార్త చదివి ఆశ్చర్యానందాల్లో మునిగిపోయింది.

"భాగ్యనగరంలో కస్టమ్స్ ఆఫీసరుగా ఈమధ్యనే చేరిన శ్రీ పుల్లయ్య అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి గంజాయి స్మగ్లర్స్ ఆటకట్టించారు. నిన్న సాయంత్రం అనుమానాస్పద పరిస్థితుల్లో ఎయిర్‌పోర్ట్ వద్ద సంచరిస్తున్న ఇద్దరు యువకుల్ని రహస్యంగా వెంటాడి, వారి స్థావరంలోకి ప్రవేశించి ప్రాణాలకి తెగించి పోరాడి రికార్డు స్థాయిలో గంజాయి నిల్వల్ని పట్టుకున్నారు శ్రీ పుల్లయ్య.

రాష్ట్రమంత్రి రాయుడుగారి కుమారుడు వినోద్, అతడి మిత్రులు వికాస్, ప్రణీత్‌లకు ఈ రాకెట్‌తో సంబంధం వుందని తేలింది. ఉద్యోగంలో చేరిన తర్వాత శ్రీ పుల్లయ్య సాధించిన మొట్టమొదటి విజయం ఇది...శ్రీ పుల్లయ్య..."

భర్త పేరు పదే పదే పేపర్లో చదువుతూ పులకాంకిత ఐపోయింది మధుశాలిని.

'హు! వికాస్, వినోద్, ప్రణీత్..ఎంత బాగున్నాయి నామధేయాలు? అలాంటి స్టైలిష్, మోడ్రన్ పేరేగా తను భర్తకి పెట్టాలనుకున్నది! కానీ ఆ పేర్లంటేనే అసహ్యం కలిగేలా వాళ్ళ చేష్టలు!

పుల్లయ్య... పేరుకే గ్లామర్ తెచ్చాడు తన ప్రియుడు. తన భర్త.

"ఏమ్మా! పేపర్లలో టీవీల్లో ఎక్కడ చూసినా మీ ఆయన పేరే" ఫోన్లో నాన్న.

"మీ వారి పేరు పేపర్లో చూశాం" అంటూ తెలిసిన వాళ్ల అభినందనలు మొదలయ్యాయి.

"కంగ్రాట్స్ మధూ! మీ ఆయన పేరు మార్మోగిపోతోంది. టీవీలో కూడా చూశాం" అంటూ రమ్య, మాధురి ఫోన్‌కాల్స్...

ఉక్కిరిబిక్కిరైపోతుంది మధు, సంతోషంతో.

'పుల్లయ్యా! పుల్లటి పేరు కూడా తియ్యగా వినిపిస్తోందయ్యా, అదయ్యా నీ క్యారెక్టరు! నాకీ పేరే కావాలి' అంటూ నిద్రిస్తున్న భర్తని ముద్దుల్తో ముంచెత్తుతూ నిద్ర లేపింది మధు.

☆

## పక్కా ప్రొఫెషనల్

కరీనా కపూర్‌ని పక్కా ప్రొఫెషనల్ అని అంటారు బాలీవుడ్ జనాలు. ఈమధ్య బాగా కనిపిస్తోంది కూడా. 'తషన్' కోసం జీరో సైజ్ పర్సనాలిటీ తెచ్చుకున్న కరీనా 'మిస్టర్ మిసెస్ ఖన్నా' కోసం బరువు పెరిగింది. ఇప్పుడు 'స్టెప్ మామ్' కోసం జుట్టు కత్తిరించుకుంటోందిట. పొట్టిగా జుట్టు కనిపించేందుకు విగ్గు వాడొచ్చు కానీ, సహజంగా వుండాలీ అంటే నిజంగానే జుట్టుని పొట్టిగా కత్తిరించుకుంటేనే బావుంటుందని కరీనా భావిస్తుందిట. కరన్ జోహార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా కరీనా కెరీర్‌ని మరో మలుపు తిప్పుతుందేమో!